




25,26 తేదీల్లో చంద్రబాబు రాక

● ఐదేళ్ల తర్వాత సీఎం హోదాలో..

కుప్పం/చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక నారా చంద్రబాబు నాయుడు తొలిసారి కుప్పం రానున్నారు. ఈనెల 25, 26 తేదీల్లో ఆయన పర్యటన దాదాపు ఖరారైంది. ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం.. శాసనసభ సమావేశాలు ముగిశాక తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో రెండు రోజుల పర్యటనకు చంద్రబాబు వస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కుప్పం నుంచి వరుసగా 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబు, నాల్గవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదటిసారిగా కుప్పంలో పర్యటించనున్న అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రికి టీడీపీ వర్గాలు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు ప్రారంభించాయి. తాజా విజయంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పొంగిపొర్లుతోంది. అదే సమయంలో అధికార వర్గాల్లో గుబులు బయలుదేరింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరించిన వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు ఇంకా ఆయా సీట్లలోనే ఉన్నారు. అటువంటి వారు ముఖ్యమంత్రి రాకపట్ల ఆందోళనగా ఉన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతోపాటు వ్యవహారాలపై పూర్తిస్థాయి పట్టువున్న చంద్రబాబు నాయుడు ఈ అవకతవకల గురించి, ఎటువంటి అవినీతి చర్యల గురించి ప్రశ్నిస్తారో, ఏమి సమాధానం చెప్పాలో అన్న భయం వారిలో కనిపిస్తోంది. కాగా, 25, 26 తేదీల్లో ముఖ్యమంత్రి కుప్పం పర్యటన ఖరారైనా, ఏయే కార్యక్రమాల్లో పాల్గొంటారనే విషయంలో స్పష్టత లేదు. టీడీపీ శ్రేణులతో ముఖాముఖిగా పాల్గొననున్నారని ప్రాథమిక సమాచారం. కుప్పంలో బహిరంగ సభ నిర్వహించాలన్న యోచనలో స్థానిక పార్టీ యంత్రాంగం ఉంది. మరోవైపు సీఎం పర్యటన ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించేందుకు కలెక్టర్ షన్మోహన్ గురువారం అమరావతికి వెళ్లినట్లు సమాచారం. ఇక, కుప్పంలో సీఎం బస చేయనున్న ఆర్అండ్‌బీ అతిథిగృహ ఆధునికీకరణ పనులను అధికారులు చేపట్టారు. పాత తహసీల్దార్ కార్యాలయంలో అన్న క్యాంటీన్ పునఃప్రారంభించేందుకు అధికారులు పనులు చేస్తున్నారు. సీఎం పర్యటన వివరాలు ఇంకా అధికారికంగా రాలేదు.

ఆ వడ్డీ డబ్బులు ఏమైనట్లు?

జిల్లా పరిషత్తులో బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘం నిధులను పీడీ ఖాతాల నుంచి సేవింగ్స్ అకౌంట్లకు మళ్లించారు. తద్వారా వచ్చిన వడ్డీ ఏమైందన్నది ప్రశ్న. 2005 నుంచి 2024 వరకు వచ్చిన వడ్డీనే రూ.వంద కోట్లు ఉంటుందని అంచనా. ఇంతకాలం గుట్టుచప్పుడు కాకుండా జరిగి పోయిన వడ్డీ డబ్బుల దుర్వినియోగం.. ఓ విశ్రాంత అధికారి ఫిర్యాదుతో వెలుగుచూసింది.

\- చిత్తూరు రూరల్

- తేలని బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘం నిధుల వడ్డీ లెక్క
- బ్యాంకులో డబ్బులున్నా ఖర్చయినట్లు యుటిలైజేషన్ సర్టిఫికెట్ అందజేసిన ఆడిట్ అధికారి
- విశ్రాంత అధికారి ఫిర్యాదుతో బయట పడ్డ బాగోతం

2008లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి 'బ్యాక్‌వర్డ్ రీజియన్ గ్రాంట్ ఫండ్ (బీఆర్‌జీఎఫ్)ను ఏర్పాటు చేశారు. ఈ నిధులను కరువు జిల్లాల్లో జడ్పీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు ఏర్పాటు, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులు ముందుగా జడ్పీకి వచ్చి.. అక్కడ్నుంచి మున్సిపాలిటీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు అందజేస్తారు. జిల్లాకు సంబంధించి ఈ నిధుల్లో 2008 నుంచి 2017 వరకు పదేళ్లపాటు అప్పటి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి.. మున్సిపాలిటీలకు రూపాయి కూడా ఇవ్వకుండా పూర్తిగా జడ్పీకి మళ్లించారు. ఇక, 2008 నుంచి 2014 వరకు బీఆర్‌జీఎఫ్.. 2005 నుంచి 2024 వరకు ఆర్థిక సంఘ నిధులు కలిపి ఏటా రూ.500 కోట్ల వరకు జిల్లాకు మంజూరయ్యాయి. ఈ నిధులన్నీ (పీడీ అకౌంట్) ప్రభుత్వ ఖాతాలకు జమయ్యేవి. ఈ ఖాతాల్లో ఉండే నిధులకు వడ్డీ రాదు. అందుకని వడ్డీ కోసం ఈ నిధులను అప్పటి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి 'సేవింగ్స్ అకౌంట్ల'లోకి మళ్లించినట్లు తెలిసింది. ఈ 'సేవింగ్స్ ఖాతాల్లో'ని డబ్బులకు వడ్డీలే సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటాయని అంచనా. ఈ వడ్డీ డబ్బులను ప్రభుత్వానికి లెక్కలు చూపించకుండా తనకు అనుకూలంగా ఉన్న ప్రజాప్రతినిధుల సొంత పనులకు వినియోగించినట్లు ఇతడిపై విశ్రాంత అధికారి కనకరాజులు నాయుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ మొదలైంది.



2008 నుంచీ జడ్పీలోనే..

2008 నుంచి 2017 వరకు పదేళ్లపాటు ప్రభాకర్‌రెడ్డి జడ్పీలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. 2017లో ఎంపీడీవోగా ప్రమోషన్ వచ్చినా వెళ్లకుండా జడ్పీలోనే ఓఎస్డీ పోస్టింగు వేయించుకొని ప్లానింగ్ సెక్షన్‌లోనే సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చా మొదట ఏవోగా, తర్వాత డిప్యూటీ సీఈవోగా, ఆ తర్వాత సీఈవోగా ఇన్‌చార్జిగా ఉంటూ.. ఏక కాలంలో ఈ మూడు పోస్టుల్లోనూ కొనసాగడం గమనార్హం.

ఏం జరుగుతోంది?

ఆర్థిక సంఘం, బీఆర్‌జీఎఫ్ నిధుల ద్వారా ఖర్చు చేసిన ప్రతి రూపాయికి ఏటా ఆడిటింగ్ చేసి అంతా సక్రమంగా ఉంటే అధికారులు యుటిలైజేషన్ సర్టిఫికెట్ అందజేస్తారు. ఇక్కడ అధికారులు ఆడిటింగ్ చేసేటప్పుడే సేవింగ్స్ ఖాతాల్లో నుంచే బిల్లులు మంజూరు చేసినట్లు గుర్తించి ఉండాలి. ఒక వేళ గుర్తిస్తే సేవింగ్స్ ఖాతాల్లో ప్రభుత్వ నిధులు ఉంచడం నేరమని, ఆ విషయాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. గుర్తించలేదన్నా...కేంద్రం నుంచి వచ్చిన డబ్బులు కన్నా అధికంగా ఖాతాల్లో ఉంటే దానిని ఆడిటింగ్‌లో ప్రస్తావించాలి. ఇవేమి కూడా ఆడిటింగ్ అధికారులు చేయకుండా యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇస్తూ రావడంపై పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. మళ్లీ దీనిపై ఆడిటింగ్ అధికారులే విచారణ చేయడం వల్ల.. సక్రమంగా ముందు సాగదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధికారం మారగానే..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ప్రభాకర్‌రెడ్డి జడ్పీలో చక్రం తిప్పారు. టీడీపీ అధికారంలోకి రావడంతో పరిస్థితి భిన్నంగా మారింది. నాడు వేధింపులకు గురైన అధికారులు, ఉద్యోగులు అతడిపై ఫిర్యాదు చేయడానికి ముందుకు వస్తున్నారు. ఇతడి వేధింపులతో నాగలాపురం ఎంపీడీవో బాలగణేష్, జడ్పీలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, టైపిస్ట్ కెనడి, రికార్డ్ అసిస్టెంట్ యుగంధర్ ప్రాణాలు కోల్పోయారని ఇటీవల అధికారులు జడ్పీ సీఈవో గ్లోరియాకు ఫిర్యాదు చేశారు. ఈ నెలాఖరున ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ ఉంది. ఆలోపే అతడిపై చర్యలు తీసుకునేలా పావులు కదుపుతున్నారు. మైనారిటీ వెల్ఫేర్ ఇన్‌చార్జి ఈడీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డిని తొలగించి ఆ స్థానంలో పూర్వ అధికారి హరినాథ్‌రెడ్డిని తీసుకురావడం అందులో భాగమేనని అంటున్నారు.



మిద్దెపై తిరుగుతున్న నెమలి

ఊర్లోకి నెమలి

కల్లూరు, జూన్ 20: పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లె పంచాయతీ గేటు కాడ బెస్తపల్లి గ్రామంలోకి గురువారం ఉదయం జాతీయ పక్షి నెమలి వచ్చింది. వీధుల్లో తిరుగుతూ.. ఇంటి మిద్దెలపైకి చేరుకొని ఒక్కొక్క ఇంటిపై నుంచి మరొక ఇంటిపైకి దాటుకుంటూ నాట్యమాడింది. దీని కదలికలను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.మంగళంపేట ఎఫ్‌బీవో మున్నాకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ సిబ్బంది గ్రామానికి చేరుకొని నెమలిని తీసుకుని.. సమీప అటవీప్రాంతంలో వదిలి పెట్టారు.

బుద్ధిలేక తప్పు చేశాం



రాజీనామా చేసిన వలంటీర్లలో పశ్చాత్తాపం

ఎమ్మెల్యేల వద్దకు ప్రదక్షిణలు

తమను కొనసాగించాలంటూ వేడుకోళ్లు

చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ పెనుమూరు, జూన్ 20: కొందరు వలంటీర్లు వైసీపీ కోసం స్వచ్ఛందంగా రాజీనామా చేసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చాలామందిని వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామా చేయించారు. డబుల్ జీతం ఇస్తామని, మళ్లీ మన ప్రభుత్వమే వస్తుందని మభ్యపెట్టారు. ఇదంతా తెలిసిన విషయమే. ఇప్పుడు ఆ రాజీనామా చేసిన వలంటీర్లలో అంతర్మథనం మొదలైంది. కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం రాజీనామా చేసిన వలంటీర్లను మళ్లీ విధుల్లోకి తీసుకునే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో వారంతా ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఏ పరిస్థితుల్లో రాజీనామా చేయాల్సి వచ్చిందో వివరించి.. తమను మళ్లీ కొనసాగించాలని వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. రాజీనామా చేయని వలంటీర్లలోనూ కొత్త ఆందోళన మొదలైంది. గత ఐదేళ్ల పాటు పనిచేసిన వలంటీర్లంతా వైసీపీ కార్యకర్తలుగా వ్యవహరించారని టీడీపీ నాయకులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో కొత్త వలంటీర్లుగా టీడీపీ సానుభూతిపరులకు చెందినవారిని నియమించుకోవాలని భావిస్తున్నారు.

వైసీపీకి దూరంగా ఉన్నవారిలో భద్రత

రాజీనామా చేయకుండా, వైసీపీకి దూరంగా వ్యవహరించిన వలంటీర్లు మాత్రం తమ ఉద్యోగ భద్రత పట్ల ధైర్యంగా ఉన్నారు. రాజీనామాలు చేసి కొందరు, చేయకుండా ఇంకొందరు వైసీపీ కోసం పనిచేసిన వారంతా అభద్రతాభావంతో ఆందోళన చెందుతున్నారు. టీడీపీ నాయకుల వద్దకు వెళ్లి మళ్లీ మమ్మల్ని కొనసాగించమని అడిగే పరిస్థితిలోనూ లేరు. గత ఐదేళ్లు, ఎన్నికల సమయంలో వైసీపీ కోసం వలంటీర్లు ఏ విధంగా పనిచేశారనే విషయం ఎమ్మెల్యేలకు నేరుగా తెలియకపోయినా.. ఆయా వార్డులు, పంచాయతీల్లో టీడీపీ నాయకులకు తెలుసు.

రూ.10 వేల వేతనంపై ఆశలు

వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల హామీ ఇచ్చిన నేపథ్యంలో.. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ రాజీనామా చేసినవారిలో పశ్చాత్తాపం మొదలైంది. ఇప్పటికే పెన్షన్ రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు వంటి హామీలను అమలు చేసిన క్రమంలో వలంటీర్లకు గౌరవ వేతనం పెంపు విషయంలోనూ త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఇప్పుడున్న, రాజీనామా చేసిన వలంటీర్లు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వలంటీర్లను మోసం చేసిన వైసీపీ నాయకులు

జిల్లాలో సుమారు 11 వేల మంది వలంటీర్లు పనిచేస్తుండగా.. ఎన్నికల కోడ్ వచ్చాక స్వచ్ఛందంగా కొందరు తప్పుకోగా.. బలవంతంగా చాలామంది రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇలా సుమారు 4 వేలకుపైగా వలంటీర్లు రాజీనామా చేసి వైసీపీ కోసం పనిచేశారు. వైసీపీ కోసం పని చేస్తే రూ.5 వేలు గౌరవ వేతనానికి బదులుగా రూ.10 వేలు ఇస్తామని, మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తుందని వైసీపీ అభ్యర్థులు నమ్మబలికి వలంటీర్ల వద్ద పని చేయించుకున్నారు. ఎక్కడా వలంటీర్లకు రూ.10 వేలు ఇచ్చిన దాఖలాలు లేవు. ఎన్నికల రోజు చాలాచోట్ల వలంటీర్లు పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ ఏజెంట్లుగా కూడా కూర్చున్నారు. వీలైనంత వరకు ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారు. ఇలా ఇష్టానుసారంగా వైసీపీ కార్యకర్తల్లా పనిచేసిన వలంటీర్లకు ఎలాగూ భవిష్యత్తు ఉండదు. కానీ, ఒత్తిళ్లలోనూ రాజీనామా చేయకుండా కొనసాగిన వలంటీర్లు మాత్రం.. తమను కొనసాగిస్తారని ఆశలు పెట్టుకుంటున్నారు.

వలంటీర్ల విధానంపై రాని స్పష్టత

వైసీపీ ప్రభుత్వం ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్లను నియమించి, వారితో అన్నిరకాల పనులు చేయించుకుంది. ఐదేళ్ల పాటు రూ.5 వేల గౌరవ వేతనాన్ని అందించింది. పెంచుతానని చెప్పినా అమలు కాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానంటోంది. ఈ క్రమంలో పాత పద్ధతిలోనే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తారా.. లేదా కొత్త విధానాన్ని తీసుకొస్తారా.. అనేది తెలియాల్సి ఉంది. 50 ఇళ్లకు ఒకర్ని, లేదా 200 ఇళ్లకు ఒకర్ని నియమిస్తారా.. అనేది క్లారిటీ రాలేదు. త్వరలో ఈ విషయంగా స్పష్టత రానుంది.

కౌన్సిలర్లు బలవంతంగా రాజీనామా చేయించారు

● వాటిని తిరస్కరించి, విధుల్లోకి తీసుకోవాలంటూ వలంటీర్ల వినతి



మున్సిపల్ కార్యాలయం ఎదుట తమను విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేస్తున్న వలంటీర్లు

పుంగనూరు, జూన్ 20: 'ఎన్నికల ముందు వైసీపీ నేతలు, కౌన్సిలర్లు మా వద్ద బలవంతంగా రాజీనామాలు చేయించారు. వాటిని తిరస్కరించి, మళ్లీ విధుల్లోకి తీసుకోండి' అని వార్డు వలంటీర్లు కోరారు. ఈ మేరకు గురువారం పుంగనూరు మున్సిపల్ కార్యాలయం ముందు వీరు నినాదాలు చేశారు. తమను ఎన్నికల ముందు అన్నిరకాలుగా వాడుకుని ప్రస్తుతం ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టం లేకపోయినా విధిలేక రాజీనామాలు చేశామని, తమ పరిస్థితి దారుణంగా మారిందన్నారు. టీడీపీ నాయకులు, సీఎం చంద్రబాబునాయుడు తమను ఆదుకోవడానికి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అనంతరం కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో 216 మంది వలంటీర్లు రాజీనామా చేశారని కమిషనరు చెప్పారు. తమతో బలవంతపు రాజీనామా చేయించారని, తమను ఉద్యోగంలో చేర్చుకోవాలని 50 మంది కోరారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, జూన్ 20: వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 ఏళ్లలోపు బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారిణి నాగశైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్య సాహసాలు, క్రీడలు, కళలు, సాహిత్యం, సంస్కృతి సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు వంటి అంశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన బాలలు వచ్చేనెల 31వ తేదీలోపు http\\awards.gov.in. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



మహేష్ అలియాస్ టోనీ

వాణ్ణి చంపేస్తాన్నా!

● టీడీపీ నేతను టార్గెట్ చేసిన వైసీపీ నేతలు ● సామాజిక మాధ్యమాల్లో ఆడియో వైరల్

కుప్పం, జూన్ 20: 'నా.. మణి అన్నా, బాలుగాణ్ణి నేను చంపేస్తాన్నా. వద్దునా, బెంగళూరులో కేసు పన్నేళ్లన్నారు. ఎత్తుకోనొచ్చి చంపెయ్యమంటే చంపేస్తా'.. ఇదీ వైసీపీ నేతతో ఫోనులో మాట్లాడిన కార్యకర్త మాటలు. కుప్పం మున్సిపల్ తెలుగు యువత అధ్యక్షుడు మహేష్‌ను చంపేస్తానంటూ లక్ష్మీపురానికి చెందిన వైసీపీ కౌన్సిలర్ కుమారుడు మణికి, ఆయన వర్గానికే చెందిన మహేష్ అలియాస్ టోనీ అనే కార్యకర్త చేసిన ఫోన్ సంభాషణ ఆడియో గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ప్రస్తుతం వీరిద్దరూ పరారీలో ఉన్నారు. మహేష్ చేసినట్లు ఉన్న ఫోను సంభాషణలో.. 'నేను నీ ఉప్పు తిన్నోడు, మా అన్న మీద చెయ్యి పెట్టినా, నీమీద చెయ్యి పెట్టినా నువ్వు నా ప్రాణము. నిన్ను తిట్టినదానికే ఆ నా కొడుకును కొడితి, నీమీద చెయ్యి పెడితే వొదిలేస్తానా!' అని మణితో అన్నాడు. ఇప్పుడు మన టైం కాదని, గవర్నమెంటు కూడా లేదని, అటువంటి పనులు పెట్టుకోవద్దని మణి చెబుతున్నా మహేష్ వినిపించుకోలేదు. ఇదంతా లోకేష్ అనే టీడీపీ కార్యకర్త చేస్తున్నాడని, అతడి తమ్ముడిని తాను కొట్టినందుకే ఇలా జరుగుతున్నదని అన్నాడు. ఫస్ట్ లోకేష్‌గాడికి, బాలుగాడికి పడితే మిగతా వాళ్లంతా సైలెంటయిపోతారంటూ పట్టుబడ్డాడు. తామిద్దరూ పరారీలో ఉన్నా, ఇంకా తమ పిలకాయలంతా (అనుచరులు) కుప్పంలోనే ఉన్నారని, మహేష్ ఏమైనా చేస్తే, వారికి ఇబ్బందవుతుందని, ఇప్పుడు టైం తమది కాదు ఊరుకోమని మణి చెప్పడానికి ప్రయత్నించాడు. ఏమాత్రం వినని మహేష్, తాను చేయదలచుకున్నది చేసి తర్వాత ఫోన్ చేస్తానని, ఊరుకునే ప్రశ్నే లేదని చెప్పాడు. ఈ ఫోను సంభాషణ కుప్పంలో వైరల్ కావడంతో.. ప్రతిపక్షంలోకి చేరాకనే ఇలా రెచ్చిపోతుంటే, అధికారంలో ఉన్నప్పుడు ఇంకెన్ని అరాచకాలు చేశారోనన్న చర్చ జరుగుతోంది. ఇలా గొడవలకు దిగే వారిని అదుపు చేయకపోతే శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లుతుందన్న ఆందోలన వ్యక్తమవుతోంది.

పోలీసులకు ఫిర్యాదు

తనను హత్య చేయడానికి వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారంటూ తెలుగు యువత నేత బాలు గురువారం టీడీపీ నేతలతో కలిసి డీఎస్పీ శ్రీనాథ్‌కు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆడియో రికార్డును సమర్పించారు. మహేష్ అలియాస్ టోనీ అనే వైసీపీ కార్యకర్త నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించడంతోపాటు వారిని అరెస్టు చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.



జాతరలో ఫుడ్ పాయిజన్

పాలసముద్రంలో 150 మందికి అస్వస్థత ● బాధితుల కోసం మూడు ప్రత్యేక వైద్యశిబిరాలు



జాతరలో అంబలి తాగుతున్న గ్రామస్థులు (ఫైల్ ఫొటో)





పాలసముద్రం బీసీ కాలనీలోని వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు - పీహెచ్‌సీలో బాధితులను పరామర్శిస్తున్న చిట్టిబాబు

పాలసముద్రం, జూన్ 20: పాలసముద్రం గంగ జాతరలో ఫుడ్ పాయిజన్ కావడంతో 150 మంది గ్రామస్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం నుంచి పలువురు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. బాధితులకు జ్వరం, వాంతులు, విరేచనాలు కావడంతో గురువారం జిల్లా వైద్యాధికారులు పాలసముద్రం చేరుకొని పీహెచ్‌సీ ఆవరణలోను, ఆర్బీకేలో, బీసీ కాలనీలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి డీపీవో లక్ష్మి, ఏపీడీ డాక్టర్ శ్రీవాణి నేతృత్వంలో డాక్టర్ల బృందం బాధితులకు వైద్యం అందించారు. గంగ జాతర సందర్భంగా అమ్మవారికి సమర్పించిన అంబలిని ప్రసాదంగా స్వీకరించిన గ్రామస్థులందరికీ ఫుడ్‌పాయిజనింగ్ అయింది. గ్రామంలో పారిశుధ్య పనులు చేయించి తాగునీరు ఏమైనా కలుషితమైందా అనే ఉద్దేశంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని తెప్పించారు. ఆ నీళ్లలో బ్లీచింగ్ పౌడర్ వేసి గ్రామంలో సరఫరా చేశారు. బాధితులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పరామర్శించారు. ఈ విషయాన్ని కలెక్టర్ షన్మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులెవరికైనా సీరియస్ అయితే రెండు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. గురువారం సాయంత్రానికి కొంతవరకు బాధితులు కోలుకున్నారు. తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో రామనాథ రెడ్డి, డాక్టర్ మోహనకృష్ణ, ఈవోపీఆర్డీ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాగర్, పంచాయతీల కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు సేవలు అందించారు.

తిరుమలకు మోకాళ్లపై వచ్చిన కలికిరి మహిళ



చివరిమెట్టు వద్ద పసుపు వేస్తున్న గౌరి

తిరుమల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఓ మహిళ మోకాళ్లపై మెట్లెక్కి తిరుమలకు చేరుకుంది. పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం, గుట్టపాళెంకు చెందిన గౌరి తన భర్త మల్లికార్జున గౌడ్‌తో కలిసి గురువారం శ్రీవారిమెట్టు మార్గంలో మోకాళ్లపై తిరుమలకు చేరుకుంది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం కావాలని, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాలని తాను గతంలో మొక్కుకున్నట్టు తెలిపారు. తన కోరిక నెరవేరిన నేపథ్యంలో మొక్కు చెల్లించుకున్నానన్నారు.

ఎంపీడీవో కార్యాలయ నిధుల దుర్వినియోగంపై చర్చ



సునీల్

పుంగనూరు, జూన్ 20: పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో జనరల్ ఫండ్స్ నుంచి రూ.1.36 కోట్లను కంప్యూటర్ ఆపరేటర్ సునీల్ తన ఖాతాకు మళ్లించడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై గురువారం ఆంధ్రజ్యోతిలో 'అమ్మో..కాంట్రాక్ట్ ఉద్యోగి!' అంటూ ప్రచురితమైన కథనం సంచలనం కలిగించింది. నిధుల గోల్‌మాల్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిధులు కాజేసిన పుంగనూరుకు చెందిన సునీల్ ఇప్పటికే విధులు వదిలేసి హైదరాబాద్, బెంగళూరుల్లో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే నిధుల రికవరీకి సునీల్‌పై అధికారులు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వనున్నట్లు తెలిసింది. 2022-23లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి అప్పటి ఎంపీడీవో, ఏవో, సీనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ ఇచ్చినట్లు ఎంపీడీవో మునిరెడ్డి తెలిపారు. వీరినుంచి రాగానే జడ్పీ సీఈవో గ్లోరియా చర్యలు తీసుకుంటారన్నారు.

తూకంలో తేడాలు

సివిల్ సప్లయిస్ గోడౌన్లలో తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20 : జిల్లాలో అన్ని వ్యవస్థలతో పాటు సివిల్ సప్లయిస్ వ్యవస్థ సైతం గాడి తప్పింది.గత ఐదేళ్ళ కాలంలో పేద ప్రజలకు ఇచ్చే రేషన్ సరుకుల్లోనూ అవినీతి చోటు చేసుకుంది.పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల రాష్ట్రంలోని కొన్ని సివిల్ సప్లయిస్ గోడౌన్లను తనిఖీ చేసినప్పుడు పలు అక్రమాలు బయటపడ్డాయి. దీంతో అన్ని జిల్లాల్లో తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.దీంతో జిల్లా అధికారులు నెల వారీగా లెక్కలు తీస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీలకు ఇక్కడినుంచే బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటివి సరఫరా చేస్తున్నారు.పంచదార, కందిపప్పు సరఫరాలో కాంట్రాక్టర్లు తూకాల్లో మోసం చేస్తున్నారని అధికారులంటున్నారు. ఒక్కో రేషన్ షాపు పరిధిలో కనీసం 10 కార్డులకు రేషన్ పంపిణీ కావడం లేదని గుర్తించారు.ఎండీయూ వాహనాలు వచ్చినప్పుడు కార్డుదారులు బయటకు వెళ్లివుంటే కందిపప్పు, బియ్యం, చక్కెర మిగిలిపోతున్నాయి. వీటికి లెక్కలు చూపడం లేదు.పేదలకు ఇస్తున్న బియ్యం, చక్కెరల్లోనూ కిలోకు 100 గ్రాములు లెక్కన తక్కువ పంపిణీ చేస్తున్నట్లు బయటపడింది.ఈ విషయమై సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ సుమతిని అడగ్గా జిల్లా వ్యాప్తంగా వున్న 12 గోడౌన్లు, మండల స్టాకు పాయింట్లలో కందిపప్పు, బియ్యం, చక్కెర స్టాకును పరిశీలించామన్నారు.తూకాల్లో తేడా వున్న మాట వాస్తవమేనని చెప్పారు. ప్రధానంగా కిలో కందిపప్పుపై 20 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు తూకం తక్కువ వున్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. అలాగే చక్కెర తూకంలోనూ కిలోపై 30 గ్రాముల వరకు తక్కువున్నట్లు బయటపడిందన్నారు. ఇకపై ప్రతి నెలా నిత్యావసర వస్తువులు తనిఖీ చేసి తూకాల్లో మోసం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీవారిమెట్టు మార్గంలో..

స్కాన్ టోకెన్లు ఉంటేనే దర్శనం: టీటీడీ



టికెట్ స్కానింగ్

తిరుమల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్లు కాలినడక మార్గంలో 1,200వ మెట్టు వద్ద దివ్య దర్శనం టోకెన్ స్కానింగ్‌ను టీటీడీ తిరిగి ప్రారంభించింది. దీనికి సంబంధించి గురువారం ట్రయల్ రన్ నిర్వహించింది. దివ్యదర్శనం టోకెన్లు పొందిన భక్తులు శుక్రవారం నుంచి విధిగా 1,200వ మెట్టు వద్ద స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే భక్తులకు దివ్యదర్శన క్యూలైన్‌లోకి అనుమతి ఉండదని టీటీడీ స్పష్టం చేసింది. గతంలో పులుల సంచారం ఉన్న నేపథ్యంలో ఈ టోకెన్లు ఉన్నా తప్పనిసరిగా నడచే రావాలనే నిబంధనలను టీటీడీ తాత్కాలికంగా రద్దు చేసింది. ఇకపై తప్పనిసరిగా టోకెన్లు పొందే భక్తులు మార్గం మధ్యలో స్కాన్ చేసుకుంటేనే దివ్యదర్శనం కేటగిరిలో దర్శనానికి అనుమతించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది.

కుప్పంలో చిన్నపిల్లల డాక్టర్ ఆత్మహత్యాయత్నం

కుప్పం, జూన్ 20: కుప్పంలో చిన్నపిల్లల వైద్యుడిగా పేరుపొందిన డాక్టర్ రూప్‌కుమార్ గురువారం ఆత్మహత్యకు యత్నించారు. ఈయన కుప్పంలోనే ఒక ప్రయివేట్ స్కూల్ కరస్పాండెంట్‌గా కూడా ఉన్నారు. అప్పుల పాలైన ఆయన.. ఆ అప్పులను తీర్చలేకనే ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. బంధువులు ఆయన్ను పీఈఎస్ ఆస్పత్రిలో చేర్చారు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.18 కోట్లు

తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.18 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. బుధవారం 79,584 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,848 మంది తలనీలాలు సమర్పించారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

● నలుగురి అరెస్ట్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూ. 40 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయిని సీజ్ చేశారు. సీఐ మహేశ్వర రెడ్డి కథనం మేరకు.. రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన దీపేష్, ఎద్దుల చెరువుకు చెందిన మేకల అశోక్, మదనపల్లె బర్మావీధికి చెందిన మణికంఠ, ఎస్‌టీవీ నగర్‌కు చెందిన భూపతి వాసులు కొంతకాలంగా తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి నెలలో 10 రోజులు వివిధ ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ నేతృత్వంలో ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తమ రెడ్డి, సిబ్బంది ఎస్‌టీవీనగర్‌లో గురువారం వీరిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 40వేల విలువైన రెండు కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేశారు. రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వద్ద హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

జోరువాన





చిత్తూరులో కురుస్తున్న వాన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: జిల్లాలో బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. మూడు మండలాలు మినహా మిగిలిన 29 మండలాల్లో మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. అత్యధికంగా గంగవరంలో 61.4మి.మీ, అత్యల్పంగా పాలసముద్రంలో 2.2 మిమీ వర్షం కురిసింది. జూన్ సగటు వర్షపాతం 80.8 మి.మీ కాగా గురువారం నాటికి 179.1 మి.మీ నమోదైంది. పలమనేరులో 53.0, బంగారుపాళ్యం 47.0, పెనుమూరు 41.0, పులిచెర్ల 37.0, పెద్దపంజాణి 34.4, వి.కోట 33.2, గుడుపల్లి 32.4, కుప్పం 30.2, గుడిపాల 27.8, సదుం 27.4, యాదమరి 25.2, రొంపిచెర్ల 23.4, తవణంపల్లె 22.4, చిత్తూరు అర్బన్ 19.6, చిత్తూరు రూరల్ 18.6, బైరెడ్డిపల్లి 16.8, రామకుప్పం 14.8, గంగాధరనెల్లూరు 14.2, సోమల 12.4, శాంతిపురం 12.2, పుంగనూరు 11.6, పూతలపట్టు 10.4, చౌడేపల్లి 9.8, ఐరాల 6.2, శ్రీరంగరాజపురం 6.0, నగరి 5.8, వెదురుకుప్పం 3.6 మి.మీ నమోదైంది. పలు చెక్‌డ్యామ్‌లు నిండాయి. పట్టణాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో సమీక్ష



నారాయణగిరి ప్రాంతంలోని క్యూలైన్లో భక్తులకు అందజేస్తున్న కిచిడీని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం గోకులం విశ్రాంతి భవనంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.వివిధ సందర్భాల్లో భారీ వర్షాలకు బండరాళ్లు కూలి దెబ్బతిన్న రెండో ఘాట్‌రోడ్డును ఎలా పునరుద్ధరించారో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కల్యాణి డ్యాంతో పాటు తిరుమలలో భక్తులకు ప్రధాన నీటి వనరులైన ఐదు డ్యాముల గురించి కూడా వివరించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాలని ఈవో ఆదేశించారు. కొనుగోళ్ళు, గిడ్డంగుల శాఖలపై సమీక్షించారు. జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఈఈలు సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీహరి, ఎలక్ట్రికల్ డీఈ రవి శంకర్‌రెడ్డి, కొనుగోళ్ల జీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.కాగా ఈవో గురువారం నారాయణగిరి షెడ్ల వద్ద వివిధ క్యూలైన్లను పరిశీలించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు వెళ్లే సర్వదర్శన, స్లాటెడ్ సర్వదర్శన, ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్లను తనిఖీ చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఈవోకు పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపించింది. క్యూలైన్లలోనే వ్యర్థాలు కనిపించడంతో ఆయన సీరియస్ అయ్యారు.సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.

అభివృద్ధిపై ప్రజల ఆశలెన్నో!

● నేడు అసెంబ్లీలో కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

చిత్తూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఏడుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షించే, సమీక్షించే అధికారాలను, ప్రొటోకాల్ తదితర సదుపాయాలన్నింటినీ సంతరించుకోనున్నారు. కుప్పం నుంచి సీఎం చంద్రబాబు, పలమనేరు నుంచి అమరనాథరెడ్డి, చిత్తూరు నుంచీ గురజాల జగన్మోహన్, పూతలపట్టు నుంచి మురళీమోహన్, జీడీనెల్లూరు నుంచి థామస్, నగరి నుంచి గాలి భానుప్రకాష్‌రెడ్డి, పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచిన సంగతి తెలిసిందే. శుక్రవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ తొలి సమావేశాలకు హాజరై ప్రమాణ స్వీకారం చేయడం కోసం వీరంతా రాజధానికి పయనమయ్యారు. చాలామంది సభ్యుల వెంట కుటుంబసభ్యులు, సన్నిహిత బంధుమిత్రులు, ముఖ్యనేతలు, అనుచరులు తరలి వెళ్ళారు. ఎమ్మెల్యేల నుంచీ జిల్లా ప్రజలు ఎంతో ఆశిస్తున్నారు. అలాగే, నూతన ఎమ్మెల్యేలు చట్టసభలో సమస్యలను ప్రస్తావిస్తారని, వాటి పరిష్కారాలకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారని, మైలురాళ్ళుగా నిలిచిపోయే అభివృద్ధి పనులను సాధిస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

ఎర్రచందనం స్వాధీనం ఇద్దరు తమిళ స్మగ్లర్ల అరెస్టు



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, జూన్ 20: అన్నమయ్య జిల్లా రాయవరం అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. కారుతో సహా 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ బుధవారం రాయచోటి మీదుగా కూంబింగ్ నిర్వహించారు. సుండుపల్లి అటవీబీట్ పరిధిలోని గంగోత్రి రాస్తా వద్ద అర్ధరాత్రి సమయంలో తనిఖీలు చేపట్టగా సుండుపల్లి సానిపాయ జంక్షన్ నుంచి ముగ్గురు మోటారు సైకిల్‌పై రావడాన్ని గుర్తించారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను చూసి వారు పారిపోతుండగా సిబ్బంది వెండించి ఇద్దరిని పట్టుకున్నారు. ఒకరు పారిపోయారు. కొందరు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి కారును వదలి వెళ్లిపోయారు. కారులో 13 ఎర్రచందనం దుంగలున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు నిర్ధారించారు. పట్టుబడ్డవారు తమిళనాడు వేలూరు జిల్లా కేవీకుప్పంకు చెందిన శరత్‌కుమార్ రవి(23), దేవరాజ్ గోవిందస్వామి(27)గా గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నంలో కిందపడిన ఓ స్మగ్లర్‌కు తలకు గాయమైనట్లు వారు తెలిపారు. వీరితోపాటు 12మంది స్మగ్లర్లు పారిపోయినట్లు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కూంబింగ్‌లో అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.





తెప్పపై పద్మావతి దేవి అభయం

● నేటితో ముగియనున్న తెప్పోత్సవాలు



గజవాహనంపై అమ్మవారి ఊరేగింపు

తిరుచానూరు, జూన్ 20: తెప్పోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు తెప్పపై విహరించి భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం పద్మసరోవరంలోని నీరాడ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన అలమేలు మంగమ్మ తెప్పపై కొలువుదీరి ఐదు పర్యాయాలు విహరించి భక్తులను అనుగ్రహించారు. రాత్రి లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారికి మాడ వీధుల్లో గజవాహన సేవ జరిగింది. శుక్రవారం గరుడవాహన సేవతో ఐదు రోజులుగా జరుగుతున్న తెప్పోత్సవాలు ముగియనున్నాయి.

రేషన్ డీలర్లకు కమీషన్ విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని రేషన్ షాపు డీలర్లకు జూన్ నెలకు సంబంధించి కమీషన్ గురువారం విడుదల చేస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లాలోని 1,379 మందికి రూ.89,42,509, తిరుపతి జిల్లాలోని 1,457 మందికి రూ.85,09,442 కమీషన్ వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ నెలకు సంబంధించి నిత్యావసర వస్తువుల పంపిణీ ప్రక్రియ ఈనెల 18వ తేదీతో ముగిసింది.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు



కొబ్బరిచెట్టును ఏనుగులు కూకటివేళ్లతో పెకలించిన దృశ్యం

కల్లూరు, జూన్ 20: పులిచెర్ల మండలంలోని పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. సుమారు నెల రోజులుగా మండలంలో తిష్ట వేసిన ఏనుగులు మామిడి, టమోటా, అరటి, కొబ్బరి తదితర పంటలకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలో బుధవారం రాత్రి సుమారు 10 ఏనుగుల గుంపు పలువురి రైతుల పంటలను ధ్వంసం చేశాయి. కోటపల్లికి చెందిన రైతు నాథముని నాయుడు మామిడితోటలోని కొబ్బరి చెట్టును కూకటివేళ్లతో పెకలించాయి. కల్లూరుకి చెందిన రైతులు సయ్యద్‌బాషా, ఖాదర్‌వల్లి వరినారును తొక్కేశాయి. రైతు యుగంధర్ మామిడిచెట్లను విరిచేశాయి. మామిడి కాయలను నేలరాల్చాయి. పభుత్వం తమను ఆదుకోవాలని ఆ రైతులు కోరారు.

రూ. 2లక్షల విలువైన సిగరెట్ల చోరీ





దుకాణం షట్టర్‌కు వేసిన తాళం పగలగొట్టివున్న దృశ్యం - దుకాణంలో చిందరవందరగా పడివున్న సరుకులు

బైరెడ్డిపల్లె, జూన్ 20 : బైరెడ్డిపల్లెలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు రెండు కిరాణా దుకాణాల్లో చోరీ చేశారు. రూ.2లక్షలకు పైగా విలువైన సిగరెట్లను దోచుకెళ్లారు. బాధితుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మెయిన్‌రోడ్డులో వినయ్‌కుమార్ దుకాణానికి వేసివున్న షట్టర్ తాళాలు పగలగొట్టి దాదాపు రూ.1లక్షా 30వేల విలువచేసే సిగరెట్ బండిళ్లు, డ్రాలో ఉంచిన రూ.15వేల నగదు కాజేశారు. అలాగే నాలుగురోడ్ల కూడలి సమీపంలో కడపనత్తం రహదారిలో కృష్ణమూర్తికి చెందిన దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి రూ.99,850 విలువైన సిగరెట్ బండిళ్లను చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధిత వర్గాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరుకున్నా

మంత్రి కొల్లు రవీంద్ర



తిరుమల, జూన్20 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన అన్ని వర్గాలకు ఈ ప్రభుత్వం అండగా ఉండాలని స్వామిని కోరుకున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, పవన్ కల్యాణ్, మోదీ సహకారంతో చక్కటి ప్రభుత్వం ఏర్పాటు కావాలని తాను ఓ యాగం చేసినట్టు తెలిపారు. యాగం సంపూర్ణంగా ముగిసిన నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టాలని, అన్ని విధాల ముందుకు తీసుకెళ్లాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదినం



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, జూన్ 20: ముఖ్య మంత్రి చంద్ర బాబునాయుడు సతీమణి, నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను కుప్పంలో టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. గురువారం పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నాయి. నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టమోటా రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

చౌడేపల్లె, జూన్20: టమోటా రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కొత్త చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రైతు భరోసా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ సహకారంతో టమోట పంట దిగుబడి పెంచేందుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా మట్టి నమూనా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర కులాల రైతులకు రూ.20లకే మట్టి నమూనా పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రైతులకు ఐవీఆర్ఎస్ పద్ధతిలో కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, మెళకువలు అందించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి సంతోషికుమారి, ట్రస్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ యశోద, రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు

గుడుపల్లె, జూన్ 20: బడి ఈడుకు వచ్చిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో లక్ష్మయ్య కోరార. 'నేను బడికి పోతా' కార్యక్రమంపై గురువారం గుడుపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో చదివే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం రూ.15 వేలు అందిస్తుందని వివరించారు. అలాగే మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బోధన, విద్యా సామగ్రి ఇస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దయచేసి విధుల్లోకి తీసుకోండి

● పంచాయతీ కార్యదర్శికి వలంటీర్ల వినతి



కల్లూరు, జూన్ 20: వైసీపీ నేతల ఒత్తిడితోనే తమ ఉద్యోగాలకు రాజీనామా చేశామని, దయచేసి తమను విధుల్లోకి తీసుకోవాలంటూ వలంటీర్లు కోరారు. గురువారం ఈ మేరకు పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ కార్యదర్శి యుగంధర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి స్పందిస్తూ వినతిపత్రాన్ని ఎంపీడీవోకు పంపుతామని తెలియజేశారు.

జగన్ రెండు నాలుకల ధోరణి మానుకోవాలి: బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, జూన్20: మాజీ సీఎం జగన్ రెండు నాలుకల ధోరణితో మాట్లాడటం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు పి.అయూబ్ ఖాన్ విమర్శించారు. గురువారం పుంగనూరు బీజేపీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో జరగని ఈవీఎంల అవకతవకలు ప్రస్తుతం ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఎన్నికల కమిషన్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పినా ఆయనలో మార్పురాకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పెద్దమఠం బాబు, రాజాశెట్టి, ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర



పలమనేరు, జూన్20 : తిరుమలకు పాదయాత్రగా సుమారు 100 మందికి పైగా భక్తులు గురువారం ఇక్కడినుంచి పాదయాత్రగా బయలు దేరి వెళ్లారు. గంగవరం మండలంలోని చౌడిరెడ్డిపల్లి, మిట్టమీద కురప్పల్లి, బత్తనపల్లి, గ్రామాలకు చెందిన 100 మందికి పైగా భక్తులు బయలు దేరారు.

ఘనంగా రెవిన్యూ డే

రామకుప్పం, జూన్ 20 : రామకుప్పం రెవిన్యూ కార్యాలయంలో గురువారం రెవిన్యూ డే ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది, అధికారులు కలిసి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అంతదూరం పోలేం..!

నగరవనాలకు వెళ్లేందుకు జనం విముఖత, కళావిహీనగా నగరవనాలు, లక్షల ప్రజాధనం వృథా





కేటిల్‌ఫారం, ముడివారిపల్లి వద్ద ఉన్న నగరవనం ప్రధాన ముఖద్వారాలు

పలమనేరు, జూన్20 : జిల్లాలోనే పేదల ఊటిగా పిలువబడే పలమనేరు రోజురోజుకూ విస్తరిస్తోంది. జనాభా సైతం పెరుగుతోంది. సముద్రమట్టానికి 2244 అడుగుల ఎత్తులో ఉన్నందున చల్లటి వాతావరణాన్ని కలిగి ఉంటుంది. అందువల్లనే పలమనేరు పేదల ఊటీగా పేరుగాంచింది. ఇటువంటి పలమనేరు పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు అటవీశాఖ నగరవనాలు ఏర్పాటు చేసింది. అయితే వాటిని పట్టణానికి సుదూరంలో ఏర్పాటు చేయడంతో 'అంత దూరమా.. మేం పోలేం' అంటూ ఆసక్తిచూపడం లేదు. ఫలితంగా అవి నిరుపయోగంగా మారాయి.

కేటిల్ ఫారం వద్ద..

పలమనేరుకు 5 కిలోమీటర్ల దూరంలోని కేటిల్‌ఫారం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న అటవీశాఖకు చెందిన ఎర్రచందనం, చింత తోపు వద్ద రెండేళ్లక్రితం నగర వనాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం దాదాపు రూ. 20 లక్షలకు పైగా ప్రజాధనాన్ని వెచ్చించి అందులో వాకింగ్ ట్రాక్, సోలార్ విద్యుత్ దీపాలు, చుట్టూ కంచె స్వాగత ఆర్చిని ఏర్పాటు చేశారు. అయితే అంతదూరం జనం వెళ్లడానికి ఇష్టపడలేదు. దీంతో పట్టించుకునేవారు లేక ఈ నగరవనం పిచ్చిమొక్కల నిలయంగా మారిపోయింది.

కౌండిన్య నదికి అనుకొని..

పలమనేరు నుంచి మండీపేట కోటూరుకు వెళ్లే మార్గంలో పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలోని ముడి వారిపల్లి గ్రామసమీపంలో కౌండిన్య నదికి ఆనుకొని మరో నగరవనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులోనూ వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లలు ఆడుకొనేందుకు వివిధ రకాల క్రీడా సామగ్రి ఏర్పాటు చేశారు. ఇందులో పనులు పూర్తి కాకుండానే గతంలో అటవీశాఖ మంత్రిగా ఉన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల ముందు అంటే మార్చి 7న ప్రారంభించారు. ఇప్పటికీ ఇక్కడ పనులు చేస్తూనే ఉన్నారు. ముందువైపు ప్రహరీ నిర్మించి మిగిలిన మూడు వైపుల ఇనుక కంచెను ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.70 లక్షలకు పైగా వ్యయం చేస్తున్నట్లు సమాచారం. ఇది కూడా పట్టణానికి దూరంగా ఉండడంతో జనం వెళ్లడానికి ఆసక్తిచూపడం లేదు.

వైట్‌సైడ్ గార్డెన్‌ను సుందరీకరించాలి..

పలమనేరులో బ్రిటీషు హయాంలో వైట్‌సైడ్ గార్డెన్ ఏర్పాటు చేశారు. అప్పట్లోనే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ఇక్కడ గార్డెన్ ఏర్పాటు చేశారు. దాదాపు 15 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గార్డెన్ ఉంది. ఇందులో వాకింగ్ ట్రాక్స్ నిర్మించారు. ట్రాక్‌కు ఇరువైపులా చింతచెట్లు నాటించారు. ఈ గార్డెన్ మధ్యలో ఒక పెద్ద తటాకాన్ని నిర్మించారు. దానికి చుట్టూ నేరేడు మొక్కలు నాటి పెంచారు. అలాగే 300 పైగా ఎర్రచందనం మొక్కలు నాటి సంరక్షించారు. ప్రస్తుతం ఆ ఎర్రచందనం చెట్లు కనుమరుగవుతున్నాయి. అటవీ అధికారులకు నిజంగా నగరవనాలను అభివృద్ధి చేయాలని ఉంటే ఈ వైట్‌సైడ్ గార్డెన్‌ను బాగుచేస్తే పట్టణ ప్రజందరూ వినియోగించుకునే అవకాశం ఉంది. లక్షల ప్రజాధనం దుర్వినియోగం చేయకుండా చరిత్రను కాపాడేలా వైట్‌సైడ్ గార్డెన్‌ను సుందరీకరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



వైట్‌సైడ్ గార్డెన్‌లో ఎర్రచందనంచెట్లు నరికేసిన ప్రాంతం

పుంగనూరులో అన్న క్యాంటీన్‌కు ఏర్పాట్లు



అన్న క్యాంటీన్ భవనానికి ఉన్న ఎంవీఐ కార్యాలయం బోర్డు చెరిపేసిన అధికారులు

పుంగనూరు, జూన్ 20: పుంగనూరులో అన్న క్యాంటీన్ ద్వారా త్వరలోనే పేదలకు రూ.5కే భోజనం అందనుంది. గత టీడీపీ హయాంలో పుంగనూరు జడ్పీ గెస్ట్‌హౌస్ ఆవరణలో మదనపల్లె -చిత్తూరు ప్రధానమార్గంలో ప్రజలకు అందుబాటులో అన్న క్యాంటీన్‌ను నాటి మంత్రి అమరనాథరెడ్డి ప్రారంభించారు. రూ.5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించేవారు. పేదలు ప్రతిరోజూ రూ.5లకే ఒక పూట ఆకలి తీర్చుకునేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లను మూసేసింది. అదే సమయంలో ఇక్కడి అన్న క్యాంటీన్ భవనాన్ని తాత్కాలికంగా ఎంవీఐ కార్యాలయంగా మార్చారు. ప్రస్తుతం టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో తిరిగి అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పుంగనూరు మున్సిపల్ డీఈ మహేశ్, ఇంజనీరింగ్ అధికారులు ప్రస్తుతం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉన్న పాత అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. భవనానికి మెరుగులు దిద్దే పనులు చేపట్టారు. ఎంవీఐ కార్యాలయం పేరును తొలగించారు. టీడీపీ నేతలు సుకుమార్ బాబు తదితరులు ఆ పనులను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌కు రంగుల వేయిస్తుండటంతో ఎప్పుడు అందుబాటులోకి వస్తుందని పేదలు ఎదురు చూస్తున్నారు. కాగా ఎంవీఐ కార్యాలయానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో భవన నిర్మాణ పనులు ఎంవీఐ సుప్రియ మొదలు పెట్టారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల బోర్డు ఏర్పాటు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న మున్నా

పుంగనూరు, జూన్20: ప్రైవేటు పాఠశాలలు తరగతుల వారీగా విద్యార్థుల ఫీజుల వివరాల బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కో-కన్వీనర్ మున్నా డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద ఇష్టారాజ్యంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారులు స్పందించి అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం



పుంగనూరు రూరల్, జూన్20: రెవెన్యూ దినోత్సవం సందర్భంగా గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ విశ్రాంత ఉద్యోగులను అధికారులు సన్మానించారు. తహసీల్దార్ శివయ్య ఆధ్వర్యంలో విశ్రాంత తహసీల్దార్ రెడ్డెప్పరాజు, రెవెన్యూ ఉద్యోగులైన వాలీశ్వర శర్మ తదితరులను శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ప్రకాశ్, వీఆర్వోలు విజయకుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, రాజు, ఎల్వీ.రమణ పాల్గొన్నారు.

గుడివంక ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నిక

గుడుపల్లె, జూన్ 20: మండల పరిధిలోని గుడివంక కొండపై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి బుధవారం టీడీపీ మండలాధ్యక్షుడు బాబు నాయుడు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీని ఆలయ ప్రాంగణంలో బుధవారం ఎన్నుకున్నారు. ధర్మకర్తగా నారాయణప్ప, కమిటీ సభ్యులుగా పెద్దగొల్లపల్లెకు చెందిన రామమూర్తి, మురుగేష్, చిన్నగొల్లపల్లెకు చెందిన అరుణ్‌కుమార్, చంద్రప్ప, కోడెప్ప బాబునగర్‌కు చెందిన మునివెంకటప్ప, పాపన్న, ఎ.గొల్లపల్లెకు చెందిన రేవన్న, అశోక్, ఎంకొత్తూరుకు చెందిన రాజ్‌గోపాల్, రామచంద్ర, వెంకటేష్, కోడిగానిపల్లెకు చెందిన మణి, చంద్ర, రమేష్, వెంకటపతి, గణేష్, వెంకటేష్, నారాయణస్వామిని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో హేమాంబరగౌడ్, బేటప్పనాయుడు, గోపాల్, భానుమూర్తి, వెంకటేశు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధతో చదవాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మునస్వామి

రామకుప్పం, జూన్ 20: విద్యార్థులు శ్రద్ధతో, క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, గురువుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉత్తమ పౌరులుగా ఎదగాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి కోరారు. గురువారం రామ కుప్పం మండలం బల్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామచంద్రన్, నేతలు నాగభూషణం, ఎర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే మానసిక ఉల్లాసం



రామకుప్పం జూన్ 20: యోగాతోనే మానసిక ఉల్లాసం, మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందని గ్రీన్ వ్యాలీ స్కూల్ కరస్పాండెంట్ నందిని మంజునాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ జ్యోతీశ్వర్ పేర్కొన్నారు. గురువారం రాజుపేట వద్ద గ్రీన్ వ్యాలీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ముందస్తు అంతర్జాతీ య యోగా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు విద్యతో పాటు యోగా, ఇతర క్రీడల్లో రాణిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. యోగా మాస్టర్ గణేష్, టీచర్లు పాల్గొన్నారు.

బడి మానేసిన పిల్లల బడిబాట



బడిమానేసిన విద్యార్థులను తీసుకొస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

రొంపిచెర్ల, జూన్20: మండలంలోని మోటుమల్లెల పంచాయతీ బాలనాగిరెడ్డిగారి పల్లె పాఠశాల పరిధిలోని మామిడితోపులో కాపలాగా ఉన్న ఎస్టీ కుటుంబాల్లో బడిమానేసిన ఏడుగురు విద్యార్థులను గుర్తించినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా మోటుమల్లెల ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లె ప్రాంతానికి చెందిన బోయకులస్తులు ఇక్కడి మామిడి తోటల్లో కాపలా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుటుంబాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు బడిమానేసి ఉండ డాన్ని గుర్తించారు. దీంతో వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారిని పాఠ శాలలో చేర్పించడానికి ఒప్పించారు. ఏడో తరగతిలో మానేసిన విద్యార్థిని కేజీబీవీలో చేర్పిం చుటకు అంగీకరించడంతో జిల్లా గర్ల్‌చైల్డ్ అభివృద్ధి అధికారితో మాట్లాడుతామని పేర్కొన్నారు. మిగిలిన విద్యార్థులను బాల నాగిరెడ్డిగారిపల్లె, రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఎంఈవో ఇందిర, హెచ్ఎం ఎర్రయ్య, సీఆర్పీ కిరణ్, రాజేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ దొరస్వామి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



రామకుప్పం, జూన్ 20 : నారా భువనేశ్వరి జన్మదినోత్సవాన్ని రామకుప్పంలో టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్న క్యాంటీన్లో పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మున స్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ అంజనేయరెడ్డి, చిన్నకృష్ణలు కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం అన్న క్యాంటీన్లో ప్రజలకు భోజనంతో పాటు ప్రత్యేక తీపి వంటకాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలపతి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజ సింహులు, నేతలు గంట్లప్ప, రామకృష్ణప్ప, సలాంసాబ్, జయ శంకర్, విజయకుమార్ రెడ్డి, రామలింగారెడ్డి, మనోహర్, సతీష్, మంజునాథ్, అమర్నథ్, రఘు, మురళీ, వేలు, నారాయణస్వామి పాల్గొన్నారు.

నీరు లేకుంటే మానవ మనుగడ లేదు



విద్యార్థుల అవగాహన ర్యాలీ

రొంపిచెర్ల, జూన్20: ప్రజల జీవనానికి నీరు అతి ముఖ్యమని ప్రతి ఒక్కరూ నీటిని వృథా కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాజంపేట పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'సేవ్ వాటర్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి చదువు, క్రీడలు, వివిధ కార్యక్రమాల్లో ప్రావీణ్యత పెంచుకోవాలని కోరారు. పాఠశాలకు, ఉపాధ్యా యులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం నీటి ఆదాపై విద్యా ర్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేశారు. హెచ్ఎం లోకనాథరెడ్డి, టీచర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి ఊరేగింపు

పుంగనూరు రూరల్, జూన్20: మండలంలోని భీమగానిపల్లెలో వెలసిన భీమేశ్వరస్వామి సతీసమేతంగా పుష్ప పల్లకిలో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పుష్పపల్లకిలో ప్రతిష్ఠించి మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. మహిళలు స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.

విశ్రాంత పీఈటీ వెంకట్రామనాయుడి మృతి



సోమల, జూన్ 20: మండలంలోని ఇరికిపెంటకు చెందిన విశ్రాంత పీఈటీ ఉప్పలపాటి వెంకట్రామనాయుడు గురువారం మృతిచెందారు. ఆయన కోడలు సులోచన ఇరికిపెంట సర్పంచ్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే సీఎం చంద్రబాబు నాయుడు ఇరికిపెంటలో జన్మభూమి గ్రామసభను నిర్వహించారు. మండలంలోని టీడీపీ నాయకులు, ఉపాధ్యాయ సంఘ నేతలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు రూరల్, జూన్20: పుంగనూరులో ఈనెల 22న విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకలు చెంగారెడ్డి, మునిస్వామిమొదలియార్‌లు తెలిపారు. స్థానిక ఎంఎస్ఆర్ థియేటర్ సమీపంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

సారా స్వాధీనం

సదుం, జూన్ 20: విక్రయానికి సిద్ధం చేసిన సారాను స్వాధీనం చేసుకున్నట్లు సదుం ఎస్ఐ షేక్ షావలి గురువారం తెలిపారు. మండలంలోని చీకలచేను తాతయ్యగుంట వద్ద సారా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో దాడి నిర్వహించామన్నారు. 100కు పైగా సారా ప్యాకెట్లు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. తయారీదారులు అప్పటికే పరారైనట్లు తెలియజేశారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఎంఈఓ

పలమనేరు, జూన్20 : పలమనేరు మున్సిపాలిటీలోని గొబ్బిళ్లకోటూరు, పలమనేరు కొత్తపేట ఉర్దూ పాఠశాలను గురువారం ఎంఈవో లీలారాణి తనిఖీ చేశారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం మెనూ మేరకు అందించాలని సూచించారు. ఎంఈవో వెంట సీఆర్ఎం గీత ఉన్నారు.

నేటి నుంచి కావమ్మ, మారయ్యల మహోత్సవం

సదుం, జూన్ 20: సదుం-కల్లూరు మార్గంలోని బట్టువారిపల్లెలో వెలసిన కావమ్మ మారయ్యల ఆలయం వద్ద శుక్రవారం నుంచి కావమ్మ మారయ్యల మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వరుసగా మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చినుకు పడితే రొచ్చు..రొచ్చే



చౌడేపల్లె సంతగేటు వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

చౌడేపల్లె/ సోమల జూన్20: చినుకు పడితే చౌడేపల్లె సంతగేటు సమీపంలో రొచ్చు రొచ్చుగా మారుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న ఓ మోస్తారు వర్షాలకు పంచాయతీ కార్యాలయం ముందు కూతవేటు దూరంలో రోడ్డు జలమయంగా మారింది. వర్షపునీరు వెళ్లడానికి మార్గంలేక రొచ్చురొచ్చుగా మారింది. రోడ్డు గుంతలు పడడంతో అడుగు లోతు నీళ్లు నిలవడంతో వాహన దారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అధి కారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

సోమల - పెద్దఉప్పరపల్లె మార్గంలోని నంజంపేట, అడుసుపల్లె, ఆవులపల్లె రోడ్డు మార్గంలో పలుచోట్ల రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షానికి ఆ గుంతల్లో నీరు నిలిచిపోయాయి. వాహనదారులు ఆదమరచి నడిపారో ఆస్పత్రికి వెళ్లాల్సిందే. ● నంజంపేట - నాయనపాకాల మార్గంలో ఇలాంటి గుంతలు నీటితో నిండి ఉన్నాయి. ఈ మార్గంలో టమోటా, మామిడి కాయల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తరచూ వాహనాలు గుంతల్లో దిగబడి పోవడం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



సోమల - నంజంపేట రోడ్డుపై ఉన్న గుంత



చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నేడు రామాంజనేయ నామ సంకీర్తన

చిత్తూరు కల్చరల్ : నగరంలోని మిట్టూరు పీజీఆర్ పోలీస్ టాప్‌లైన్ కోదండరామాలయంలో శుక్రవారం రామాంజనేయ నామ సంకీర్తన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు మురళి తెలిపారు. నగరవాసులు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఇంట్లో నుంచి విద్యుత్తు తీగలు

గంటల్లో సమస్యను పరిష్కరించిన పూతలపట్టు ఎమ్మెల్యే

ఐరాల, జూన్ 20: పూతలపట్టులోని పక్కాలగుట్ట ప్రాంతవాసులు తాగునీటి సమస్యతో అల్లాడిపోతున్నామని ఇటీవల ఎమ్మెల్యే మురళీమోహన్ ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. నెల రోజులుగా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పక్కాలగుట్టకు వెళ్లి తక్షణమే సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే పనితీరు పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా ఐరాల మండలం పొలకలసంతగేటు ప్రాంతానికి చెందిన మార్కొండ నాయుడి ఇంట్లో నుంచి విద్యుత్తు లైను వెళ్తుండగా, బాధితుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు అర్జీ ఇచ్చిన పట్టించుకోలేదని ఆవేదన చెందారు. స్పందించిన మురళీమోహన్ వెంటనే విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే ఇంట్లో నుంచి తీగలను మార్చారు. బాధితుడు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు చిన్న చిన్న పనులున్నా నేరుగా ఎమ్మెల్యే మురళిని కలవడం అలవాటు చేసుకుంటున్నారు.

నేడు పౌర్ణమి గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్, జూన్ 20: నగరంలోని ఆలయాల్లో శుక్రవారం పౌర్ణమి పూజలు, గిరి ప్రదక్షిణలు, పల్లకి సేవలు నిర్వహించనున్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి బాబాకు పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ ఆర్.శేషనారాయణ పేర్కొన్నారు.

వైభవంగా ధర్మరాజుల స్వామి ఊరేగింపు



నింద్ర, జూన్ 20: అత్తూరు ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా గురువారం ధర్మరాజస్వామిని రథంపై ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. కార్యనిర్వాహకులు గిరిబాబు, రాజగోపాల్, రాజేశ్వరి పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

యాదమరి, జూన్ 20: మండలంలోని 14కండ్రిగ ముస్లింవాడ పాఠశాల విద్యార్థులకు గురువారం హెచ్ఎం పూజారి భాస్కర్ నాయుడు పాఠ్య పుస్తకాలు అందజేశారు. బడిమానేసిన పిల్లలను బడిలో చేర్పించడానికి తల్లిదండ్రులు, విద్యా కమిటీ ఛైర్మన్‌కు పలు సూచనలు చేశారు.

ఘనంగా భానుప్రకాష్ జన్మదిన వేడుకలు





భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు నేతలు

నగరి జూన్20: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తిరుపతిలోని ఆయన స్వగృహానికి చేరుకున్న పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. కొందరు నోటు పుస్తకాలు తీసుకు రాగా, వాటిని విద్యార్థులకు అందించమని ఆయన కోరారు. నగరి ఏరియా వైద్యశాలలో పార్టీ చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, నగరి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గుండ్రాజుకుప్పం వద్ద సన్మానించారు. నగరి మండల పరిధిలోని మునగమాకులకొత్తూరు సమీపంలో గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. 110 మంది ఆయన అభిమానులు రక్తదానం చేశారు. పేదలకు బియ్యం, విద్యార్థులకు ప్లేట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. నేతలు బాలాజీ, పురుషోత్తంనాయుడు, శ్రీనివాసన్, గుణశేఖర్, కేజేరాము, వంశీరా జ్, చిట్టిబాబు, కేజేమురళి, కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, మురళీనాయుడు, చిట్టి, అమ్మ త రాజ్‌నాడార్, అల్లిముత్తు, అలెక్స్, ఏలుమలై, వెంకటేశులు, రాజశేఖర్, మీరా, సురేష్ నాయుడు, లక్ష్మీనారాయణ రాజు, ధనంజయరాజు, ఉమాపతిరాజు పాల్గొన్నారు.



భానుప్రకాష్‌కు సన్మానం

కష్టాల్లో తోడుగా ఉంటా: భాను

నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కష్టంగా వచ్చినా కుటుంబ సభ్యుడిగా అండగా ఉంటానని ఎమ్మెల్యే భానుప్రకాష్ పేర్కొన్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సేవలకు అంకితమవుతానన్నారు. నియోజవర్గ అభివృద్ధితోపాటు యువత కు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు.



జాతరలో ఫుడ్ పాయిజన్

● పాలసముద్రంలో 150 మందికి అస్వస్థత ● బాధితుల కోసం మూడు ప్రత్యేక వైద్యశిబిరాలు




పాలసముద్రం బీసీ కాలనీలోని వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు - పీహెచ్‌సీలో బాధితులను పరామర్శిస్తున్న చిట్టిబాబు



జాతరలో అంబలి తాగుతున్న గ్రామస్తులు (ఫైల్ ఫొటో)

పాలసముద్రం, జూన్ 20: పాలసముద్రం గంగ జాతరలో ఫుడ్ పాయిజన్ కావడంతో 150 మంది గ్రామస్తులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం నుంచి పలువురు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. బాధితులకు జ్వరం, వాంతులు, విరేచనాలు కావడంతో గురువారం జిల్లా వైద్యాధికారులు పాలసముద్రం చేరుకొని పీహెచ్‌సీ ఆవరణలోను, ఆర్బీకేలో, బీసీ కాలనీలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి డీపీవో లక్ష్మి, ఏపీడీ డాక్టర్ శ్రీవాణి నేతృత్వంలో డాక్టర్ల బృందం బాధితులకు వైద్యం అందించారు. గంగజాతర సందర్భంగా అమ్మవారికి సమర్పించిన అంబలిని ప్రసాదంగా స్వీకరించిన గ్రామస్థులందరికీ ఫుడ్‌పాయిజనింగ్ అయింది. గ్రామంలో పారిశుధ్య పనులు చేయించి తాగునీరు ఏమైనా కలుషితమైందా అనే ఉద్దేశ్యంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని తెప్పించారు. ఆ నీళ్లలో బ్లీచింగ్ పౌడర్ వేసి గ్రామంలో సరఫరా చేశారు. బాధితులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పరామర్శించారు. ఈ విషయాన్ని కలెక్టర్ షన్మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులెవరికైనా సీరియస్ అయితే రెండు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. గురువారం సాయంత్రానికి కొంతవరకు బాధితులు కోలుకున్నారు. తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో రామనాథ రెడ్డి, డాక్టర్ మోహనకృష్ణ, ఈవోపీఆర్డీ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాగర్, పంచాయతీల కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు సేవలు అందించారు.

యువకుడి అదృశ్యం

పూతలపట్టు, జూన్ 20: మండలంలోని ఎగువ పాలకూరుకు చెందిన బాలయ్య కుమారుడు గోపీచంద్(17) అదృశ్యమయ్యాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆ యువకుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతకడం మొదలుపెట్టారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్ద చెప్పులు పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, చిత్తూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడి ఆనవాళ్లు కనిపించక పోవడంతో పోలీసులు వెనుదిరిగారు. కాగా, తాను కేరళకు వెళుతున్న ఆ యువకుడు స్నేహితులతో చెప్పినట్లు తెలుసుకుని, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నింద్రలో ఎమ్మెల్యే జన్మదిన సంబరాలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, జూన్ 20: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినోత్సవాన్ని మండలంలో వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. నింద్రలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వందలాదిగా తరలి వచ్చిన నాయకులు ఆయనను గజమాలతో సన్మానించి, కేక్ కట్ చేశారు. నాయకులు వెంకటేశ్వరరావు, దశరథవాసు, రవినాయుడు, చిట్టిబాబు, లోకనాథ నాయుడు, బాబుయాదవ్, గాలి రమేష్‌నాయుడు, బాబునాయుడు, ఓంప్రకాష్, తేజేష్, మనోహర్ నాయుడు, దొరస్వామినాయుడు, మనోజ్ యాదవ్, రమేష్, విజయ్‌కుమార్, గంగాధరం నాయుడు, మురళీనాయుడు, ప్రకాష్, రాంబాబు, లింగయ్య పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన అరుణ



పెనుమూరు, జూన్ 20: సీఎం నారా చంద్రబాబు నాయుడును అమరావతిలో గురువారం చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి త్వరలో తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన సూచించినట్లు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

నలుగురికి తీవ్ర గాయాలు




ప్రమాదానికి గురైన కారు
గాయపడ్డ కరుణాకరన్

పూతలపట్టు, జూన్ 20: తిరుమలకు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. తమిళనాడు రాష్ట్రం తిరుపూరు ఉడుమలపేట గణపతిపాళ్యానికి చెందిన కరుణాకరన్ కుటుంబసభ్యులతో కలసి తిరుమల శ్రీవారి దర్శనార్థం బయలుదేరారు. మండలంలోని చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారి సప్తగిరి హోటల్ సమీపంలో కారు ముందు టైరు పగిలిపోవడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కరుణాకరన్‌తో పాటు లావణ్య, సచ్చిదానందన్, నందిని తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. సీఐ సుదర్శన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 20: నీట్ ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గాంధీ విగ్రహ కూడలిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నీట్ యూజీసీ నెట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 67 మంది విద్యార్థులకు 720 మార్కులు రావడం, అందులో ఆరుగురు ఒకే సెంటర్‌లో ఉండటం అనుమానాలను బలపరుస్తోందన్నారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించి, తిరిగి పరీక్ష నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ చిత్తూరు కన్వీనర్ ప్రవీణ్, షేక్‌బాబు, చరణ్, లోకేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న డీఈవో దేవరాజు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 20: ప్రభుత్వ బడుల బలోపేతానికి ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని యూటీఎఫ్ నేతలు కోరారు. ప్రభుత్వ బడులను రక్షించుకుందాం, విద్యార్థులను అందులోనే చేర్పుదామనే నినాదంతో యూటీఎఫ్ ముందడుగు వేసింది. ఈ అంశంపై ముద్రించిన కరపత్రాన్ని గురువారం పీసీఆర్ ఉన్నత పాఠశాలలో డీఈవో దేవరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, మనిగండన్, నాయకులు రహనబేగం, రెడ్డెప్ప, బాషా, సరిత పాల్గొన్నారు.

శేషవాహనంపై కోదండరాముడి రాజసం



తవణంపల్లె, జూన్ 20: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు శేషవాహనంపై ఊరేగారు. ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఊంజల్‌సేవ అనంతరం శేషవాహనంపై మేళతాళాల నడుమ ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రసాదరావుకు సన్మానం



చిత్తూరు సిటీ, జూన్ 20: చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును గోవా ఇన్‌కంట్యాక్స్ గెజిటెడ్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. గురువారం గోవాలో కర్ణాటక, గోవా యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి దగ్గుమళ్ల హాజరయ్యారు. అసోసియేషన్ సభ్యులు ఆయనను సన్మానించారు. ఐఆర్ఎస్ ఆఫీసర్‌గా ఆయన సేవలను కొనియాడారు.

పాళ్యంకొండ ఆలయ కమిటీ ఎన్నిక

గుడిపాల, జూన్ 20: మండలంలోని పాళ్యం ఆలయ కొండ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏఎల్ పురం సర్పంచ్ గుర్రప్ప నాయుడు, ఉపాధ్యక్షుడిగా నారగల్లు సర్పంచ్ మోహన్ నాయుడు, కార్యదర్శిగా 197 రామాపురానికి చెందిన తారకరామ్, సంయుక్త కార్యదర్శిగా చిట్టిబాబు, కోశాధికారిగా రాజు, సభ్యులుగా టి.ఎస్.రమేష్, సురేంద్ర నాయుడు, భూపాల్ నాయుడు, గిరి, మధుసూదన్, ఢిల్లీబాబులను ఎన్నుకున్నారు.

జిల్లావ్యాప్తంగా జోరువాన




చిత్తూరు నగరంలో జోరుగా కురుస్తున్న వాన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: జిల్లాలో బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. మూడు మండలాలు మినహా మిగిలిన 29 మండలాల్లో మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. అత్యధికంగా గంగవరంలో 61.4మి.మీ, అత్యల్పంగా పాలసముద్రంలో 2.2 మిమీ వర్షం కురిసింది. జూన్ సగటు వర్షపాతం 80.8 మి.మీ కాగా గురువారం నాటికి 179.1 మి.మీ నమోదైంది. పలమనేరులో 53.0, బంగారుపాళ్యం 47.0, పెనుమూరు 41.0, పులిచెర్ల 37.0, పెద్దపంజాణి 34.4, వి.కోట 33.2, గుడుపల్లి 32.4, కుప్పం 30.2, గుడిపాల 27.8, సదుం 27.4, యాదమరి 25.2, రొంపిచెర్ల 23.4, తవణంపల్లె 22.4, చిత్తూరు అర్బన్ 19.6, చిత్తూరు రూరల్ 18.6, బైరెడ్డిపల్లి 16.8, రామకుప్పం 14.8, గంగాధరనెల్లూరు 14.2, సోమల 12.4, శాంతిపురం 12.2, పుంగనూరు 11.6, పూతలపట్టు 10.4, చౌడేపల్లి 9.8, ఐరాల 6.2, శ్రీరంగరాజపురం 6.0, నగరి 5.8, వెదురుకుప్పం 3.6 మి.మీ నమోదైంది. పలు చెక్‌డ్యామ్‌లు నిండాయి. పట్టణాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

గుట్ట కబ్జా యత్నం



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

శ్రీరంగరాజపురం, జూన్ 20: మండలంలోని చొక్కమడుగు జగనన్న కాలనీలో గుట్ట కబ్జాకు గురైంది. వైసీపీ నేత దాన్ని కబ్జాచేసి, షెడ్డు నిర్మాణానికి ప్రయత్నిస్తున్నాడని తెలిసి తహసీల్దారు ఆల్ఫ్రెడ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఇక్కడ ఎవ్వరూ ప్రవేశించరాదని సూచించారు. గతంలో ఈ కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు గుట్టను కబ్జాచేసి, అమ్ముకునే ప్రయత్నం చేశాడని, ఆక్రమణలను అడ్డుకుని ఆ స్థలాన్ని పేదలకు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సోదరుడు నిది అధికారులకు సూచించారు.

తిరుమలకు పాదయాత్ర



పూతలపట్టు, జూన్ 20: చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం, పూతలపట్టు ఎమ్మెల్యేగా మురళీ మోహన్ గెలుపొందడంతో మండలంలోని బందార్లపల్లె గ్రామానికి చెందిన హేమాద్రినాయుడు, దయ, ప్రవీణ్, పురుషోత్తం నాయుడు తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. వీరికి టీడీపీ రాష్ట్ర నేత యువరాజులు నాయుడు, చిరంజీవి నాయుడు, సోమశేఖర్ నాయుడు సంఘీభావం తెలిపారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలి



రెవెన్యూ దినోత్సవంలో అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: ప్రజా సమస్యలకు రెవెన్యూ సిబ్బంది పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని పాత స్పందన హాలులో జరిగిన రెవెన్యూ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు రెవెన్యూ సిబ్బంది చేరువగా ఉండి సమస్యలకు పరిష్కారం చూపేలా పని చేయాలన్నారు. డ్రాఫ్టింగ్, చట్టాల గురించి అవగాహన పెంచుకుని శాఖ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఎంప్లాయీస్ కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ పార్థసారధి, కార్యదర్శి హేమాద్రి రాజు పాల్గొన్నారు.

చాకిరీ చేయించుకుని డబ్బివ్వడం లేదు

- మధ్యప్రదేశ్ యువతుల ఆవేదన



ఫిర్యాదు చేసేందుకు వెళుతున్న యువతులు

గుడిపాల, జూన్ 20: గుడిపాలలోని ప్రైవేటు జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం తమతో బండెడు చాకిరీ చేయించుకుని డబ్బు ఇవ్వడం లేదని మధ్యప్రదేశ్‌కు చెందిన యువతులు గురువారం గుడిపాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కాంట్రాక్టర్ పుదీన్ కాక్ సీకేపల్లిలోని ఓ ప్రైవేటు జ్యూస్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు 30 మంది యువతులను తీసుకొచ్చారని తెలిపారు. 45 రోజులుగా తమతో బండచాకిరీ చేయించారని, డబ్బు అడిగితే సెల్‌ఫోన్లు లాక్కుని అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కోరారు.

నోటు పుస్తకాల పంపిణీ..అన్నదానం



విజయపురం : మండలంలోని ఆలపాకంలో టీడీపీ నేత శరవణ, పాతార్కాడులో టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, బొబ్బిలి విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. మాదవరంలో సెల్వం, మహారాజపురంలో బాలసుబ్రహ్మణ్యంరాజు, మల్లారెడ్డి కండ్రిగలో సమరసింహారెడ్డి, కేశవపురంలో కొండూరు దాము, విజయపురంలో చుక్కా ధనుంజయయాదవ్, పన్నూరు, బూచివానత్తం, జీఎంపురంలో కేక్ కట్ చేశారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు. పార్టీ నేతలు రమేష్‌రాజు, స్వామినాథన్, బాబుయాదవ్, రఘునాథరెడ్డి, వెంకటేసులుయాదవ్, పురుషోత్తం, లోకేష్‌రాజు, మురళి, బాలాజీనాయుడు, బెంజిమన్, కపిల్, శరత్ పాల్గొన్నారు.

రవీంద్ర జన్మదిన వేడుకల్లో జీజేఎం



చిత్తూరు సిటీ, జూన్ 20: రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జన్మదిన వేడుకల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి జన్మదినం సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేశారు. గురజాల జగన్మోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానానికి రూ.10వేలు వితరణ



చిత్తూరు కల్చరల్, జూన్ 20: నగరంలోని తపోవనం వృద్ధాశ్రమంలో అన్నదానానికి ఎస్బీఐ ఉద్యోగులు రూ.10వేలు అందజేశారు. ఎస్బీఐ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకుడు తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ మొత్తం అందజేసినట్లు తెలిపారు.

రెడ్డిగుంట సబ్‌స్టేషన్‌లో ఈఈ తనిఖీలు



చిత్తూరు రూరల్, జూన్ 20: నగరంలోని రెడ్డిగుంట సబ్‌స్టేషన్‌ను విద్యుత్ శాఖ చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆపరేటర్లను ఆదేశించారు. స్టేషన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం కావడంతో విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

యాదమరి స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు



యాదమరి, జూన్ 20: యాదమరి పోలీసుస్టేషన్‌ను గురువారం చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. తమిళనాడు సరిహద్దులో ఉండటంతో అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. సీఐ రవిశంకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. యోగాతో లభించే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సిద్ధిసమాధి యోగా ఆధ్వర్యంలో..

చిత్తూరు కల్చరల్ : సిద్ధిసమాధి యోగా ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు యోగా గురువులు నరేంద్రకుమార్, బ్రహ్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రివర్గంలో బీసీలకు ప్రాధాన్యం

గంగాధరనెల్లూరు, జూన్ 20: చంద్రబాబు మంత్రి వర్గంలో బీసీలకు అధిక ప్రాధాన్యత లభించిందని టీడీపీ జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ పేర్కొన్నారు. తిరుమలకు వచ్చిన మంత్రి కొల్లు రవీంద్రను మండలానికి చెందిన టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేయాలని కోరారు.

కైలాసపురానికి తాగునీరు అందించండి

చిత్తూరు రూరల్, జూన్ 20: కైలాసపురంలో అసంపూర్తిగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును పూర్తి చేసి, కాలనీ వాసులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. అసంపూర్తిగా ఉన్న ట్యాంకు వద్ద గురువారం నిరసన తెలిపారు. కాలనీ వాసులు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ట్యాంకు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు విజయ్ కుమార్, రమాదేవి, చంద్ర పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రజల ఆశలెన్నో!

● నేడు అసెంబ్లీలో కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

చిత్తూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఏడుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షించే, సమీక్షించే అధికారాలను, ప్రొటోకాల్ తదితర సదుపాయాలన్నింటినీ సంతరించుకోనున్నారు. కుప్పం నుంచి సీఎం చంద్రబాబు, పలమనేరు నుంచి అమరనాథరెడ్డి, చిత్తూరు నుంచీ గురజాల జగన్మోహన్, పూతలపట్టు నుంచి మురళీమోహన్, జీడీనెల్లూరు నుంచి థామస్, నగరి నుంచి గాలి భానుప్రకాష్‌రెడ్డి, పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచిన సంగతి తెలిసిందే. శుక్రవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ తొలి సమావేశాలకు హాజరై ప్రమాణ స్వీకారం చేయడం కోసం వీరంతా రాజధానికి పయనమయ్యారు. చాలామంది సభ్యుల వెంట కుటుంబసభ్యులు, సన్నిహిత బంధుమిత్రులు, ముఖ్యనేతలు, అనుచరులు తరలి వెళ్లారు. ఎమ్మెల్యేల నుంచీ జిల్లా ప్రజలు ఎంతో ఆశిస్తున్నారు. అలాగే, నూతన ఎమ్మెల్యేలు చట్టసభలో సమస్యలను ప్రస్తావిస్తారని, వాటి పరిష్కారాలకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారని, మైలురాళ్ళుగా నిలిచిపోయే అభివృద్ధి పనులను సాధిస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.